క్లుప్తంగా

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి


నాగరాజ(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నాగరాజ (79) అనారోగ్య సమస్యలతో బుధవారం రాత్రి మృతి చెందారు. గురువారం పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు.

62 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: 189 కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సంధ్య గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు చేసి, తగు సూచనలను ఇచ్చారు. మొత్తం 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. వేసవి జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. మంచానికి పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది విజయ, చంద్ర, అనురాధ, అనిత, శివగామి పాల్గొన్నారు.

బీసీజీ టీకాతోనే టీబీ కట్టడి


వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

చిత్తూరు రూరల్(కాణిపాకం): బీసీజీ వ్యాక్సిన్‌తోనే క్షయ వ్యాధిని కట్టడి చేయగలిగామని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని మాపాక్షి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిష్యత్‌లో టీబీ లేని సమాజం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ముందస్తు నివారణ చర్యల్లో బీసీజీ వ్యాక్సిన్ తీసుకొచ్చిందన్నారు. అర్హులైన వారికి కచ్చితంగా టీకాను వేయాలని సిబ్బందికి సూచించారు.

వినాయకుడి సేవలో యలమంచిలి ఎమ్మెల్యే

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని గురువారం విశాఖపట్నం జిల్లా యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు. తీర్థ ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పెనుమూరు(కార్వేటినగరం): గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎంపీపీ హేమలతరెడ్డి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన గురువారం పెనుమూరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మండల కోఆప్షన్ సభ్యుడు మురాద్ ఖాన్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం తెలిపారు.

పాఠశాలలు పునఃప్రారంభం..

విద్యార్థుల్లో నవోత్సాహం

బడి గంట మోగింది. తెల్లారే సరికి పిల్లలు చకచక పాఠశాల వైపు అడుగులు వేశారు. ముందుగానే బడికి చేరుకుని కాసేపు పాఠశాల మైదానంలో ఉత్సాహంగా గడిపారు. గణ..గణ..గంట మోగిన వెంటనే తరగతి గదులకు పరుగులు పెట్టారు. టీచర్లు...బోర్డుపై సుద్దముక్కకు పని చెప్పారు. పిల్లలు పుస్తకాలు తెరిచారు. విరామం, టీచర్లు లేని సమయాల్లో వేసవి కబుర్లతో గడిపారు.


చిత్తూరు బడి ఆవరణలో విద్యార్థుల సందడి

చిత్తూరు రూరల్(కాణిపాకం): వేసవి సెలవుల అనంతరం చిత్తూరు నగర, మండలంలోని పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. చిత్తూరు పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 96, ప్రాథమికోన్నత పాఠశాలలు 7, హైస్కూల్‌లు 23..ఉండగా మొత్తం 126 బడులున్నాయి. వీటిని పండుగ వాతావరణంలో ప్రారంభించారు. తొలిరోజు హాజరుశాతం తక్కువగా కనిపించింది. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో పిల్లలు బడులకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు తొలిరోజు కావడంతో బోధనను ప్రారంభించారు. ఆపై వేసవికబుర్లు, విహార యాత్రలు తదితర విషయాలపై పిల్లలతో ముచ్చటించారు. చాలా పాఠశాలల్లో చిన్నారులను స్కూళ్లలో చేర్పించేందుకు తల్లిదండ్రులు రావడంతో సందడి నెలకొంది. అలా తొలిరోజు సరదాగా గడిచిపోయింది.

పాఠ్య పుస్తకాల పంపిణీ

గుడిపాల: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలను ఎంఈఓ–2 గణపతి గురువారం అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు 17వేల పాఠ్య పుస్తకాలను అందజేసినట్లు ఎంఈఓ తెలిపారు. మిగిలిన పుస్తకాలను త్వరలోనే అందజేస్తామని చెప్పారు.

ఉచిత పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి

తవణంపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉచిత పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో తవణంపల్లె హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు హేమలత, త్యాగరాజులురెడ్డి, హెచ్‌ఎం శ్రీరంజని, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిత్తూరు: పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు


గుడిపాల: హెచ్‌ఎంలకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ

పారిశుద్ధ్యం పట్టని కార్పొరేషన్


వెంగళరావు కాలనీలో పేరుకుపోయిన చెత్తా చెదారం

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు, ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం ఇంకా ఆ ప్రక్రియలోనే ఇరుక్కున్నట్లు కనిపిస్తోంది. నగరంలో ఇప్పటికే వాతావరణం మారడం, వర్షాలు మొదలవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. దీన్ని అరికట్టడానికి ముందస్తు ప్రణాళికతో వెళ్లాల్సిన కార్పొరేషన్‌లోని ప్రజారోగ్య విభాగం నిద్రమత్తులో ఉంది. నగరంలోని చాలా చోట్ల చెత్తను తొలగింపజేయడంలో అధికారులు దృష్టి పెట్టడం లేదు. ప్రధాన రోడ్లు, కూడళ్లను శుభ్రం చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు.. కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం లేదు. ప్రధానంగా దిగువ మధ్యతరగతి కుటుంబాలు నివాసముంటున్న ప్రాంతాలపై ఏమాత్రం దృష్టి పెట్టడంలేదు. మూడు రోజులకోసారి చెత్తను తీయడం, గ్యాంగ్‌వర్కులు ఆపేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి. పెద్ద వర్షాలు పడకముందే కాలువలను శుభ్రం చేయించి, పిచ్చి మొక్కలను తొలగిస్తే వ్యాధులను దూరం చేయవచ్చని నగరవాసులు చెబుతున్నారు.

పేదలందరికీ వైద్య సేవలు

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలందరికీ వైద్య సేవలందిస్తున్నామని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మల్లకుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 45 మంది రోగులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలన్నారు. జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి, వైద్యం చేయించుకోవాలన్నారు.


రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

వైభవంగా గంగ జాతర


బంగారుపాళెం: గంగమ్మ ఊరేగింపు


తగ్గువారిపల్లెలో..

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సును విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఉట్ల తిరునాళ్లను నిర్వహించారు. ఉట్లమాను అధిరోహించేందుకు యువకులు పోటీపడ్డారు. రాత్రి అమ్మవారిని మేళతాళాలు, బాణాసంచా వేడుకల నడుమ జల ప్రవేశానికి తరలించారు. అలాగే మండలంలోని తగ్గువారిపల్లె గ్రామంలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర పంటలతో బహుళ ప్రయోజనాలు


వ్యవసాయాధికారి నాగరాజు

గుడుపల్లె: ఖరీఫ్ సీజన్‌లో వేసే వేరుశనగ పంటలో చిరుధాన్యాల సాగు రైతులకు ఎంతో శ్రేయస్కరమని వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. వేరుశనగ ఎకరా విస్తీర్ణంలో సాగు చేయాలంటే రూ.25 వేలు, రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఇదే సాగులో అంతర పంటలుగా చిరుధాన్యాలు వేస్తే అదే పెట్టుబడితో మరింత లాభాలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కొర్ర, అండ్రుకొర్ర, సజ్జ, జొన్న, అలసంద, కంది, సామ పంటలు వేయడంతో ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. వాతావరణంలో మార్పులు, తక్కువ వర్షపాతం ఉన్నా కూడా చిరుధాన్యాల పంటలు మాత్రం పండుతాయని తెలిపారు. చిరుధాన్యాల విత్తనాలకు కూడా తక్కువ ధరలో అధిక దిగుబడి వస్తుందన్నారు.

ప్రత్యేకమైన ఎరువులు అవసరం లేదు

ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగులో అంతరపంటలుగా చిరుధాన్యాల పంటలు వేయాలని వ్యవసాయాధికారి తెలిపారు. చిరుధాన్యాల పంటలకు ప్రత్యేకమైన ఎరువులు, మందులు వేసే అవసరం లేదన్నారు. అంతర పంటల సాగుతో భూమి కూడా సారవంతంగా మారుతుందని తెలిపారు. చిరుధాన్యాలు 60 నుంచి 70 రోజుల్లో పంట కోతకు వస్తాయని, చిరుధాన్యాల పంటలు ఎక్కువగా సేంద్రియ ఎరువులతోనే పండుతాయన్నారు. దీంతో ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిదని తెలిపారు. వేరుశనగ సాగులో అంతరపంటలు వేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వస్తాయన్నారు. పంటలకు ఒకే సారి ఎరువులు, కలుపు తీయడం వల్ల ఖర్చు తగ్గుతుందని తెలిపారు.


వేరుశనగ విత్తుతున్న కూలీలు

ఒత్తిడి లేని విద్య అవసరం


పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ దేవరాజు

గంగాధర నెల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని, ఒత్తిడి లేని విద్య అవసరమని చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు అన్నారు. మండలంలోని నెల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మమేకమై ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పిల్లలతో ముచ్చటించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారు భవిష్యత్తులో లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. 2024 జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని మొదటి, రెండు, మూడో స్థానం నెల్లేపల్లి పాఠశాలకు రావడంతో విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంజనేయులు శెట్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడు యుగంధర్ ఆచారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిపాజిట్లపై వడ్డీ రేట్ల పెంపు

తవణంపల్లె: సప్తగిరి గ్రామీణ బ్యాంకు డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచినట్లు తవణంపల్లె శాఖ బ్రాంచ్ మేనేజర్ తిరుమలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్లపై అత్యధికంగా 8.6 శాతం వడ్డీరేట్లు పెంచినట్లు పేర్కొన్నారు. రెండేళ్లకు పైబడిన డిపాజిట్లపై ఏడాదికి సాధారణ వ్యక్తులకు 8.1 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.6 శాతం వడ్డీరేట్లు పెంచినట్లు తెలిపారు. అలాగే ఏడాదికి సాధారణ వ్యక్తుల డిపాజిట్లకు ఏడాదికి 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీరేట్లు పెంచినట్లు పేర్కొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి


కూలీలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శ్రీరంగరాజపురం: ఉపాధి హామీ పనులను ఏపీఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మస్టర్ రికార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలని, కూలీల సంఖ్యను పెంచి, వారి హాజరును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. ప్రతి కూలీకి ఒక పనిదినానికి గరిష్టంగా రూ.300 కేటాయించామన్నారు. కూలీల హాజరులో ఏవైనా అవకతవకలు చేస్తే సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగిస్తామన్నారు. అనంతరం మండలంలోని శ్రీరంగరాజపురం, జీఎంఆర్ పురం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ ఫారం, కాలువ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జేఈ జ్యోతి, టీఏ నౌషాద్, రేఖ, బాల, రామ్మూర్తి, నోమేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ శకుంతల, జ్యోతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును మింగిన ఘనులు

- నగం ఇప్పటికే ఆక్రమణ
- ఫీడర్, సప్లయ్ చానళ్లు సైతం మాయం
- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణలు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం
- ఇదీ బిసన్నవడ్డు చెరువు దీనగాథ



బిసన్న వడ్డు చెరువులో కంచె వేసి ఆక్రమించుకున్న ఆక్రమణదారులు

పెద్దపంజాణి: పూర్వకాలంలో ఊరు పచ్చగా ఉండాలని చెరువులు తవ్వించి పంటలు పండేలా రాజులు చేశారు. కానీ ఇప్పుడు అక్రమార్కులను వీటిపై కూడా కన్నేసి దర్జాగా ఆక్రమించేస్తున్నారు. మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీ తిప్పిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని బిసన్నవడ్డు చెరువును పెనుగొలకలకు చెందిన ఇద్దరు రైతులు సగానికి పైగా చెరువును కబ్జా చేసి తమ పొలాల్లోకి కలుపుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పాలన స్తబ్ధత నేపథ్యంలో అడిగేవారులేరనే ధైర్యంతో ఇప్పుడు కూడా జేసీబీ వాహనాలు పెట్టి ఆక్రమణలను యథేచ్ఛగా చేస్తున్నారు. చెరువు ఆయకట్టుదారులు ఇప్పటికే ఈవిషయపై స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవు. పైగా అధికారుల సాక్షిగా ఆక్రమణలు సాగుతున్నా తమకెందుకులే అనే విధంగా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయకట్టు దారులు ఆవేదన చెందుతున్నారు.

తొమ్మిదెకరాల చెరువులో సగానికిపైగా ఆక్రమణ..

రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్లు 107–2,3,4లో మొత్తం 8.71 ఎకరాలుగా ఉంది. అయితే ప్రస్తుతం ఇందులో నాలుగెకరాలు కబ్జాకు గురైంది. పైపెచ్చు చెరువుకు సంబంధించిన సప్లయ్ చానళ్లు సైతం నాశనం చేశారు. చెరువుకట్టను ధ్వంసం చేస్తున్నారు. దీంతో వర్షాలు పడినా వరద నీరు చెరువులోకి రాకుండా పోయింది. ఈ విధంగా నీటిని రానీయకుండా చేస్తూ మొత్తం చెరువును మాయం చేయాలనే దురుద్దేశంతో ఆక్రమణదారులు పథకం మేరకు ఇలా అక్రమాలు చేస్తున్నారని ఆయకట్టులోని మార్కొండారెడ్డి, ఆంజిరెడ్డి, అమరారెడ్డి చెబుతున్నారు.

ఒకరిపై మరొకరు వేసుకుంటూ..

చెరువు ఆక్రమణపై ఆయకట్టు రైతులు స్థానిక తహసీల్దార్ నాగేంద్ర దృష్టికి తీసుకెళ్లగా ఆయన చెరువు విషయం తనకు సంబంధం లేదంటూ పట్టించుకోలేదు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు దీనిపై స్పందించలేదు. దీంతో బాధిత రైతులు చెరువును ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచడం లేదని చెబుతున్నారు. చెరువు కబ్జా కారణంగా కిందనున్న భూములకు నీరందక పచ్చటి పొలాలు బీడు భూములుగా మారాయి. జిల్లా స్థాయి అధికారులైనా ఈ కబ్జాపై స్పందించి చెరువును కాపాడాలని చెరువును నమ్ముకొని సేద్యం చేసే కుటుంబాలు విన్నవిస్తున్నాయి.


ఆక్రమణకు గురైన చెరువు


చెరువు కట్టను ధ్వంసం చేస్తున్న జేసీబీ

కొండెక్కిన కూరగాయల ధరలు


పుత్తూరులోని కూరగాయల దుకాణం, (కింద) రూ.20 వంతున అమ్ముతున్న కుప్ప కూరగాయలు

- బీన్స్ కిలో రూ.150
- పచ్చిమిర్చి కిలో రూ.100
- టమాట కిలో రూ.70
- ఎర్రగడ్డలు రూ.50
- క్యారెట్ రూ.70.
- చిక్కుడు రూ.70



పుత్తూరు: కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే అరకొర ఆదాయంతో కూరగాయలు కొని తినలేమని వాపోతున్నారు. రెండు వారాల క్రితానికి, ఇప్పటికి ధరలు రెట్టింపు కావడంతో బెంబేలెత్తిపోతున్నారు. రెండు వారాల క్రితం వరకు టమాట కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.60కి చేరింది. బీన్స్ రూ.80 నుంచి ఒక్కసారిగా రూ.150కి పెరిగింది. పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.100కు పెరిగింది. అలాగే ఎర్రగడ్డలు, చిక్కుడు, బీరకాయ, క్యారెట్ వంటి అన్ని కూరగాయల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిలలాడుతున్నారు. పూట గడిస్తే చాలన్నట్టు ప్రజలు ఆర్థిక జాగ్రత్తలు పాటిస్తున్నారు. వ్యాపారులు సైతం యాభై శాతం మేరకే సరుకులు కొనుగోలు చేసి విక్రయించుకొనే పరిస్థితి ఏర్పడింది.